

నాన్నా..! ఏమైంది నీకు

నిద్రిస్తున్న కొడుకు, కుమార్తెపై తండ్రి గొడ్డలితో దాడి చేసి తాను ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ప్రొద్దుటూరు మండలంలో జరిగింది. - 4లో



పండుగ పూట విషాదం

గువ్వల చెరువు ఘాట్ రోడ్డులో ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీ కొనడంతో అనూరాధ (30) అనే వివాహిత మృతి చెందింది. - 4లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.190	రూ.280
రెండోరకం	రూ.100	రూ.186

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 158 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	640	646
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 345.74 కిలోలు



భోగి పండుగ సందర్భంగా భోగి మంటల ఆనందోత్సాహాల మధ్య మహిళలు

పులకించిన పల్లె!

ఆకాశాన గాలిపటాల సందడులు.. వాకిళ్లలో రంగవల్లులు.. ఇంటింటా పిండి వంటల ఘుమఘుమలు.. డూడూ బసవన్నల విన్యాసాలు.. అందరినీ ఒక్కటి చేసే వేడుక.. సంస్కృతిని కళ్లకు కట్టే వైభోగ సంక్రాంతి.. ముచ్చటైన మూడు రోజుల పండగతో పల్లెసీమలు కళకళలాడుతున్నాయి.

- గడప గడపలో ఘుమఘుమలాడే పిండి వంటకాల తయారీ
- పెద్ద పండుగ కోసం పల్లెబాట పట్టిన పట్టణాలు
- బంధువులతో కళకళలాడుతున్న పల్లె సీమలు

రాయచోటి: పెరట్లో పూసిన గులాబీకి, ప్లాస్టిక్‌తో చేసిన ఫ్లవర్‌కి ఎంతో తేడా ఉంది. కొళాయి నీటికి, చెరువు నీటికి కూడా ఎంతో వ్యత్యాసం ఉంది. ముఖాన పౌడర్ పూసుకుని నవ్వే నకిలీ నవ్వులకు, ఏ కల్మషం లేని అచ్చమైన, స్వచ్ఛమైన పల్లె నవ్వుకూ పొంతనే లేదు. ఒక్క మాటలో చెప్పాలంటే పల్లెటూళ్లు స్వర్గం లాంటివి. అక్కడ ఉంటే పవిత్రమైన దేవాలయంలో ఉన్నట్లుగా ఉంటుంది. ఈ మాటలు పట్టణం, నగరాలలో అనునిత్యం రణగొణ ధ్వనుల మధ్య కాలాన్ని వెల్లదీస్తున్న యువత, వారి కుటుంబ సభ్యుల నోటి నుంచి వినిపిస్తున్నాయి. అందుకే నిన్నటివరకు వృద్ధులు, నిస్సహాయులు, రైతులతో మాత్రమే కనిపించిన పల్లెలు పండుగ సందర్భంగా పట్టణం వదిలి పల్లె వైపుగా వచ్చిన ప్రజలతో కళకళలాడుతున్నాయి. బంధువులు, కుటుంబ సభ్యులు కలిసి మెలిసి జరుపుకునే పండుగలలో అతి పెద్ద పండుగ సంక్రాంతి. సంక్రాంతి వచ్చిందంటే ముగ్గులు, గొబ్బెమ్మలు, గంగిరెద్దులు, ఆటలు, కోడిపందేలు మాత్రమే కాకుండా సంప్రదాయ వంటలు కూడా పోటీపడి తయారవుతున్నాయి. అరిసెలు, సున్నుండలు, జంతికలు, సకినాలు, నువ్వుల ఉండలు ఇలా ప్రాంతాలను బట్టి రకరకాల పిండి వంటలు తయారు చేస్తున్నారు. ఒక్కో పిండి వంటకు ఒక్కో రుచి, ఒక్కో ప్రత్యేకత ఉంటుంది.

పల్లెకు కొత్త శోభ

పల్లెటూళ్లు ఇప్పుడు పులకరించి పోతున్నాయి. పరవశించి పదాలు పాడుతున్నాయి. ఎప్పటికైనా మేమే మొనగాళ్లం అంటూ మీసం మెలేస్తున్నాయి. పట్నం బతుకుదెరువు ఇస్తే పల్లె బతుకే ఇచ్చిందన్నది నగ్నసత్యం. ఆయుష్షు పోసి నిండు నూరేళ్లు వర్ధిల్లమని మనసారా ఆశీర్వదిస్తోంది పల్లె. అలాంటి పల్లెటూళ్లకు ఇప్పుడు పట్టణాలు జై అంటున్నాయి. తెలుగు వారి పెద్ద పండుగ సంక్రాంతి కోసం పట్టణాలన్నీ కలిసి పల్లెలకు తరలి వచ్చేశాయి.

కదలిన బస్తీలు

పండుగ బండీ రద్దీగా ఉంది. అందులో ఎందరు ఉన్నా అందరినీ కలిపి పల్లె వైపు వేగంగా పరుగులు పెడుతోంది. అది బస్సయినా. రైలయినా, కారైనా ఇలా ఏ బండైనా అందరినీ గమ్యాన్ని చేర్చేందుకు ఉరకలు వేస్తోంది. బరువైన బాధ్యతను గొప్పగా నిర్వహిస్తోంది. పట్టణాలన్నీ ఒకేదారి పట్టి మరీ పల్లెలకు కదలి వచ్చాయి. ఏడాది పొడవునా పట్నం సావాసం చేసిన జనం పల్లె తల్లి కళ్లలో వెలుగు చూడాలని తపిస్తూ వచ్చారు. ఎన్ని కష్టాలు పడైనా ఆ తల్లి ఒడిలో సేద తీరాలనేలా పండుగ బండి రద్దీగా పరుగులు తీస్తూ వచ్చింది.

బోసిపోయిన పట్నం

పట్టణాల డొల్లతనం బయట పెట్టేసింది సంక్రాంతి. ఎన్ని హంగులు ఉన్నా మాకొద్దు అంటున్నారు జనం. పల్లెకుకు పోదాం చలో అంటూ మనోవేగంతో దారులు వెతుకుతూ తరలి వచ్చారు. మరి పల్లెతో పోటీ పెట్టుకున్న పట్నం ఇప్పుడు బోసిపోయి కనిపిస్తోంది. జనం లేక ప్రధాన వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఎన్నో రంగులు చూపిస్తానంటూ ఊరించిన పట్టణాలు, నగరాలు మాకొద్దు అంటూ పల్లెకు జై కొడు తున్న జనంతో పట్టణాల అసలు బండారం బయటపడిపోయింది. పల్లెలన్నీ కిటకిటలాడితే పట్టణాలు వెలవెలబోతున్నాయి. సంక్రాంతి వెలుగులతో గ్రామీణ భారతం మరింత వైభవాన్ని సంతరించుకుంది.

పల్లె క్రీడల్లో మునిగి తేలుతూ...

ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు, సాఫ్ట్‌వేర్, ఇతర సాంకేతిక నిపుణులు, ఉపాధి నిమిత్తం వలస వెళ్లిన కార్మిక వర్గాలు పండుగ సందర్భంగా పల్లె క్రీడల్లో మునిగి తేలుతున్నారు. పెద్దలు పల్లె ముంగిట్లో ఒకరికి ఒకరు తోడై వారి గత స్మృతులను నెమరు వేసుకుంటూ ఆనందోత్సాహాలతో పండుగ వేళ సేద తీరుతున్నారు. ఇక మహిళలు కొత్తకొత్త వంటకాల తయారీ, కొత్త దుస్తులు, బంగారు నగల ధారణలతో వారి ఆనందాన్ని పంచుకుంటున్నారు. ఏది ఏమైనా పాడుబడినట్లు కనిపించిన పల్లె సీమలు సంక్రాంతి పండుగ సంబరాలతో సరికొత్త కళను సంతరించుకున్నాయి.



సంక్రాంతి పండుగ సందర్భంగా ఇంటి ముంగిట రంగురంగుల ముగ్గు



వంటకాల తయారీలో మహిళలు

కారుణ్య కాంతి

- ప్రజా రవాణాలో కారుణ్య నియామకాల కింద 14 మందికి పోస్టింగ్
- 2016-20 మధ్య వివిధ కారణాలతో మృతి చెందిన కుటుంబాల్లో పలువురికి అవకాశం
- ఆయా కుటుంబాల్లో వెలుగులు నింపిన సంక్రాంతి

సాక్షి రాయచోటి : ప్రజా రవాణాశాఖలో పని చేస్తూ మృతి చెందిన వారికి సంబంధించిన కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. 2016–20 సంవత్సరాల మధ్య మృతి చెందిన ఉద్యోగుల కుటుంబాల వారికి కారుణ్య నియామకం కింద ఉద్యోగ అవకాశం కల్పించారు. అన్నమయ్య జిల్లా పరిధిలోని 14 మందికి ఇటీవల ఉన్నతాధికారుల సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం పోస్టింగ్స్ ఇచ్చారు. దీంతో సంక్రాంతి పండుగ ఆయా కుటుంబాల్లో కొత్త వెలుగులు తెచ్చింది. ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం కాకమునుపు పెండింగ్‌లో ఉన్న కొన్నింటికి సంబంధించి కారుణ్య నియామకాల కింద ఉద్యోగ అవకాశం కల్పించారు.

సచివాలయాల్లో కొలువులు

జిల్లాలో కారుణ్య నియామకాల కింద 14 మందికి రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల పరిధిలో డిజిటల్ అసిస్టెంట్, వీఆర్వో, వెల్ఫేర్ అసిస్టెంట్ ఇలా వివిధ పోస్టుల్లో నియామకాలు కల్పించింది. జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అభ్యర్థుల జాబితాను పరిశీలించి ఉమ్మడి జిల్లా నేపథ్యంలో అటు చిత్తూరు, ఇటు వైఎస్సార్ జిల్లాల అధికారులకు జాబితాను పంపించి నియామకాలు చేపట్టారు. అర్హులందరికీ ప్రభుత్వ శాఖల్లో కొలువులు ఇచ్చారు.

తిను.. తిల్లాడు!

- నవతరంలో నయా ట్రెండ్..
- ఈట్ అండ్ ప్లే రెస్టారెంట్లు
- ఆహ్లాదానికి కే(రా)ఫ్‌లు..'ఫుడ్..కోర్టు'లు

ఒరేయ్.. ఆడుకుంది చాల్లే..
ఇంట్లోకొచ్చి బువ్వ తిందువుగానీ రా..
ఉండమ్మా.. ఇంగాసేపు ఆడుకొని వచ్చా..
ఎప్పుడూ ఉండే అన్నమేగా.. ఒకప్పుడు
తల్లీకొడుకుల సంభాషణ ఇది.. రేయ్ సెల్లు
అంతంతసేపు చూస్తే కళ్లు పోతాయ్‌రా..
కొంచేపు బయటికెళ్లి ఆడుకో పో..
పోమ్మా.. పిజ్జా ఇప్పిచ్చేనే పోతా.. సరేలే..
'ఫుడ్..కోర్టు'కు పోదాం రా..
ఇపుడు అమ్మాబిడ్డల ముచ్చట ఇది..



సాక్షి, కడప డెస్క్ : కాలంతో పాటు మనుషుల ప్రవర్తనలో, ఆలోచనా ధోరణిలో వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. పల్లెలు సైతం కొత్త హంగులద్దుకోవడానికి పరితపిస్తున్న వేళ.. పట్టణాలు ప్రయోగాలతో పరుగులు తీస్తున్నాయి. ఇదివరకు కాసింత తీరిక దొరికినప్పుడల్లా ఆడుకునేందుకు.. మనసారా నాలుగు మాటలు మాట్లాడేందుకు వీలుగా చోటుండేది. ఇప్పుడు పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. దీంతో మనసులకు మాటలు, శరీరానికి వ్యాయామం అన్నదే లేకుండా పోయాయి.

సృజనాత్మక ఆలోచనల ఫలితం..

ప్రస్తుతం డబ్బు సంపాదించడమే ఏకైక లక్ష్యంగా మనిషి ఉరుకులు పరుగుల జీవితం గడుపుతున్నాడు. ఈ క్రమంలో తిండికి, వ్యాయామానికి పూర్తిగా దూరమయ్యాడు. ఫలితంగా ఎన్నో అనర్థాలు దేహాన్ని చుట్టుముడుతున్నాయి. ఈ పరిణామాన్ని సైతం కొందరు వ్యాపారమార్గంగా మలిచేందుకు తమ ఆలోచనలకు పదును పెట్టారు. సృజనాత్మకతతో అవకాశాన్ని సృష్టించుకున్నారు. ఈ నేపథ్యంలోనే 'ఈట్ అండ్ ప్లే' రెస్టారెంట్లు పుట్టుకొచ్చాయి. కాలానుగుణంగా అందరూ కోరుకునే రకరరకాల రుచులను అందించేందుకు కేఫ్‌లు.. మనసు కు ఆహ్లాదాన్ని, దేహానికి కాసింత వ్యాయాయం కోసం క్రికెట్, షటిల్ తదితరాలు ఆడుకునేందుకు వీలుగా కోర్టులు ఏర్పాటయ్యాయి. అద్భుతమైన ఇంటీరియర్ డిజైన్లు..అవుట్‌డోర్, ఇన్‌డోర్ సిట్టింగ్‌లతో ఇవి అందరి మదినీ దోచేస్తున్నాయి. మరికొందరు కేఫ్‌లను పెట్టకపోయినా, వాటికి దగ్గరగా చిన్నపాటి ఆట మైదానాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవలి కాలంలో వైఎస్సార్, అన్నమయ్య జిల్లా కేంద్రాలతో పాటు ఓ మోస్తరు పట్టణాల్లో ఇలాంటి 'ఫుడ్.కోర్టు'లు విరివిగా వెలుస్తున్నాయి.

అందరినీ ఆకట్టుకునేలా..

విశాలమైన స్థలంలో ఒక వైపు పార్కింగ్.. మరో వైపు పిల్లలు ఆడుకునేందుకు వీలుగా పచ్చికతో కూడిన మైదానం (నెట్/కోర్టు).. ఒక వారగా పైన, కింద ఫ్లోర్‌లలో తినడానికి వీలుగా వివిధ రకాల రుచుల సమ్మేళనంతో కూడిన కేఫ్‌లు.. ఇవన్నీ ఒకే ప్రాంగణంలో ఉంటున్నాయి. వెజ్, నాన్ వెజ్ వెరైటీలతో పాటు సౌత్, నార్త్, చైనీస్, అరేబియన్ రుచులన్నీ అందుబాటులో ఉంచుతున్నారు. ఐస్ క్రీమ్‌లు, చాక్‌లెట్లు, చాట్స్, బేక్స్ తదితర స్టాళ్లు కూడా ఉన్నాయి. దీంతో కుటుంబాలు ఇలాంటి ఫుడ్‌కోర్టులకు క్యూ కడుతున్నాయి. మరీ ముఖ్యంగా యువత వీటిని తమ కేరాఫ్ అడ్రస్‌గా మార్చుకుంటోంది. ఒకే దెబ్బకు రెండు పిట్టలన్న చందంగా కావలసినంత సేపు అక్కడే ఆడుకోవడం(గంటకింత రేటు చొప్పున చెల్లించాలి).. అలసిపోయాక నచ్చినవి ఆర్డరిచ్చుకుని తినడం లేదా వీలైతే ముందే తినడం, తర్వాత ఆడుకోవడం.. ఓ అలవాటుగా మార్చుకుంటున్నారు. వారాంతపు దినాలు, పండుగలు, సెలవు రోజుల్లో ఈ కేఫ్/రెస్టారెంట్/కోర్టులు కిక్కిరిసిపోతున్నాయి. పుట్టినరోజులు, వార్షికోత్సవాల లాంటి వేడుకలకు కూడా ఇవి వేదికలవుతున్నాయి.

వ్యాధి, వాదులకు దూరంగా..

రాయలసీమలో 'యాల పొద్దుకు తింటే వ్యాధి లేదు. ఒదిగి తిల్లాడితే వాదు లేదు' అని ఒక సామెత ఉంది. వేళకు భోజనం చేస్తే రోగం రాదు.. చికాకు తెప్పించేవారి నుంచి తప్పించుకు తిరిగితే వాదన ఉండదని అర్థం. వ్యాధి, వాదులాటలకు దూరంగా ఉంటేనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని పెద్దల ఉవాచ. దీనికి ఆధునిక రూపంగా 'ఇష్టమొచ్చినట్లు తిను.. చిత్తమొచ్చినట్లు తిల్లాడు' అని కొత్త సామెత పుట్టుకొచ్చింది. జీవనశైలితో పాటు ఆహార విహారాల్లో చోటుచేసుకున్న మార్పులను అంగీకరిస్తూనే.. ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చనేది దీని అర్థం. ఆప్తులతో కలిసి ఆహారం తీసుకుంటే పెరిగే అనుబంధం.. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆడుకుంటే కలిగే ఆనందం.. శరీరం, మనసును దృఢపరుస్తాయి. వైద్యులు, మందులకు దూరంగా ఉంచుతాయి.

కాసింత వ్యాయామం దొరికినట్లే..



ఉద్యోగం, కుటుంబ బాధ్యతలతో మనిషి జీవితం ఉరుకుపరుగుల మయమైంది. ఉదయాన్నే లేచి వాకింగ్ చేసే పరిస్థితి కూడా కరువైంది. ప్రస్తుత కాలంలో 'ఈట్ అండ్ ప్లే'లు రావడం ఒకింత మంచిదే. పిల్లలకే కాదు పెద్దోళ్లకు కూడా కాసింత వ్యాయామం లభిస్తుంది. పైగా ఇంట్లో ఆడవాళ్లకూ కాసింత తీరిక దొరికినట్లే.
– పీర్ల సర్ఫరాజ్ నవాజ్, కడప

పిల్లలకు పండుగ



ఇటీవలే నగరంలోని ఓ ఈట్ అండ్ ప్లే సెంటర్‌కు ఫ్యామిలీతో వెళ్లాం. నిజంగా బాగుంది. పిల్లలు గంటపాటు క్రికెట్ బ్యాట్‌తో పండుగ చేసుకున్నారు. రుచికరమైన ఫుడ్ అక్కడే లభించడంతో సంతోషమేసింది. మంచి నిర్ణయమే ఇది. ధరలే కొంచెం మండుతున్నాయి. – ఆదిత్య, రాజారెడ్డి వీధి, కడప

రుచులన్నీ ఒకేచోట



ప్రజల మారుతున్న అభిరుచులకు అనుగుణంగా రెస్టారెంట్‌ను ఏర్పాటు చేశాం. వైఎస్సార్ జిల్లాలో తొలి ఆల్ ఇన్ వన్ ఫుడ్‌కోర్టు మాదే.
– వరుణ్‌రెడ్డి, డిస్ట్రిక్ట్ డ్రైవ్ ఇన్, కడప

అందరికీ ఆనందం



రాయచోటిలో తొలిసారి ఆర్టిఫిషియల్ క్రికెట్ మైదానం ఏర్పాటు చేశా. యువకులు, పెద్దలు.. అందరికీ బాగుంటుంది. – సిద్దు హుస్సేన్, ఆర్‌సీటీ కోర్ట్, రాయచోటి

వైభవంగా సౌమ్యనాథుని కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

నందలూరు(రాజంపేట): సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సౌమ్యనాథాలయంలో శనివారం స్వామివారి కల్యాణం నిర్వహించారు. స్వామివారి కల్యాణానికి ఎంఆర్‌కెఆర్ సంస్థ అధినేత మేడా రఘునాథరెడ్డి, ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్యేసోదరుడు మేడా మధుసూదనరెడ్డి హాజరయ్యారు. ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు. ఎంపీపీ తనయుడు మేడా శ్రావణ్‌రెడ్డి, ఆలయ మాజీచైర్మన్ సౌమిత్రి ఎంపీటీసీ సభ్యుడు సోమిశెట్టిసునీతప్రభాకర్, నాగిరెడ్డిపల్లె సర్పంచి జంబుసూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు అరిగెలనాని, సోమిశెట్టి ప్రభాకర్, నాగసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని అన్నదమ్ములకు తీవ్రగాయాలు

మదనపల్లె : ఆటో ఢీకొనడంతో అన్నదమ్ములు తీవ్రంగా గాయపడ్డారు. పట్టణంలోని మారుతీనగర్‌లో నివాసం ఉన్న నరసింహులు(38), మల్లికార్జున(26) శనివారం ద్విచక్రవాహనంలో మార్కెట్ నుంచి కోళ్లబైలుకు వెళుతుండగా ఆటో ఢీకొంది. ప్రమాదంలో వీరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ మద్యం మత్తులో వాహనాన్ని నడిపినందు వల్లే ప్రమాదం జరిగిందని అన్నదమ్ములు తెలిపారు.





నాన్నా..ఏమైంది నీకు!

- నిద్రిస్తున్న సమయంలో కొడుకు, కుమార్తెపై తండ్రి గొడ్డలితో దాడి
- విషమంగా పిల్లల ఆరోగ్య పరిస్థితి
- పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన తండ్రి




తీవ్రంగా గాయపడిన అభితేజారెడ్డి, పావని



ఆత్మహత్య చేసుకున్న నరసింహారెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : అతనికి మంచి వ్యక్తిగా గ్రామంలో పేరు. తన పని తాను చేసుకొని వెళ్లే మనస్తత్వం. చాలా మృదు స్వభావి కూడా. కుటుంబమన్నా, పిల్లలన్నా అమితమైన ప్రేమ. అయితే అమితంగా ప్రేమించే కన్న తండ్రే కర్కోటకుడిగా మారిన క్షణం అది. మతిస్థిమితం కోల్పోయిన అతను నిద్రపోతున్న పిల్లలపై గొడ్డలితో విచక్షణా రహితంగా దాడి చేశాడు. తండ్రి చేతిలో అల్లారు ముద్దుగా పెరిగిన పావని నాన్నా..! ఏమైంది నీకు అంటూ ప్రాణభయంతో బాత్రూంలో దాక్కుంది. ఈ హృదయ విదారక సంఘటన ప్రొద్దుటూరు మండలంలోని నక్కలదిన్నె గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నక్కలదిన్నె గ్రామానికి చెందిన బాసిరెడ్డి నరసింహారెడ్డికి (47) భార్య తులశమ్మ, అభితేజరెడ్డి అనే కుమారుడు, పావని అనే కుమార్తె ఉన్నారు. ప్రొద్దుటూరులోని ఒక ప్రవేట్ పాఠశాలలో కుమారుడు 10వ తరగతి, కుమార్తె పావని 9వ తరగతి చదువుకుంటున్నారు. వారికి ఉన్న రెండెకరాల పొలాన్ని బంధువులకే కౌలుకు ఇచ్చారు. నరసింహారెడ్డి పురుగు మందుల కంపెనీలో సేల్స్ మేనేజర్‌గా పని చేస్తూ మానుకున్నాడు. వీరు 10 ఏళ్ల పాటు సమీపంలోని ప్రొద్దుటూరులో నివాసం ఉండేవారు. ఆరు నెలల క్రితం నుంచి తమ స్వగ్రామమైన నక్కలదిన్నెలో ఉంటున్నారు. అతను అప్పుడప్పుడూ మానసిక ఆరోగ్య సమస్యతో బాధ పడేవాడు. ఈ క్రమంలో ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఐదేళ్ల నుంచి ఏ పనికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఐదు నెలల క్రితం అతనికి పిత్తాశయానికి సంబంధించిన ఆపరేషన్ చేశారు. అప్పటి నుంచి అతను గ్రామంలో ఎవరితోనూ మాట్లాడకుండా మౌనంగా ఉండేవాడు.

ముందుగా కొడుకుపై దాడి..

శుక్రవారం రాత్రి నరసింహారెడ్డి భార్యా పిల్లలతో బాగా మాట్లాడాడు. అందరూ కలిసి భోజనం చేసిన తర్వాత కొంత సేపు సరదాగా టీవీ కూడా చూశారు. తులశమ్మకు దగ్గు ఉండటంతో టానిక్ తాగి బెడ్‌రూంలో పడుకుంది. పిల్లలిద్దరూ హాల్‌లోని బెడ్‌పై పడుకోగా, నరసింహారెడ్డి మాత్రం పక్కనే ఉన్న దివాన్‌పై పడుకున్నాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత నరసింహారెడ్డి భార్య పడుకున్న గది తలుపు చిలుకు పెట్టాడు. కొంత సేపటి తర్వాత ఇంట్లో గొడ్డలి తీసుకొని ముందుగా కుమారుడు తలపై బలంగా కొట్టాడు. గొడ్డలి పోట్లకు అతను రక్తపు మడుగులో కుప్పకూలి పోయాడు. తర్వాత పావనిపై కూడా గొడ్డలితో దాడి చేశాడు. నరసింహారెడ్డి అప్పటికే పురుగుల మందు తాగి ఉండటంతో విష ప్రభావం కారణంగా అతని ఒంట్లో సత్తువ తగ్గిపోయింది. దీంతో కుమార్తె తలపై వేసిన గొడ్డలి పోటు జారిపోయింది. వెంటనే తేరుకున్న పావని ఏమైంది నాన్న నీకు.. ఎందుకు ఇలా చేస్తున్నావంటూ భయంతో బాత్రూంలోకి వెళ్లి గడియ పెట్టుకుంది. హాల్‌లోని నుంచి పిల్లల అరుపులు, గొడ్డలి వేటు శబ్దాలు రావడంతో బెడ్‌రూంలో ఉన్న తులశమ్మ గట్టిగా కేకలు వేయసాగింది. తలుపులు తెరవమని ప్రాధేయపడినా అతను పట్టించుకోలేదు. కొంత సేపటి తర్వాత తల్లి సూచన మేరకు బాత్రూంలో ఉన్న పావని పరుగెత్తుకుంటూ వచ్చి వాకిలి తీసింది. వెంటనే బంధువులు, స్థానికులు ఇంట్లోకి ప్రవేశించి తులశమ్మ గది తలుపులు తీశారు. ముగ్గురిని హుటా హుటినా ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే నరసింహారెడ్డి మృతి చెందినట్లు నిర్ధారించారు. అభితేజారెడ్డి, పావనిలను కర్నూలు ఆస్పత్రికి తరలించారు. అభితేజారెడ్డి ఆరోగ్య పరిస్థితి మరింత విషమంగా మారడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.

ఊరంతా సంతోషంతో జరుపుకునే సంక్రాంతి పండుగ రోజు ఈ విషాదం చోటు కోవడం గ్రామస్తులను కంటతడి పెట్టిస్తోంది. తులశమ్మ అమ్మగారి ఊరు బి మఠం మండంలోని ముదిరెడ్డిపల్లె. సంక్రాంతి పండుగకు కుటుంబ సభ్యులందరూ అక్కడికి వెళ్లాలనుకున్నారు. అయితే అంతలోపే ఈ దారుణం జరిగిపోయింది.

పిల్లలను ప్రేమగా చూసుకునేవాడు..

నరసింహారెడ్డి పిల్లలిద్దరినీ బాగా చూసుకునేవాడని గ్రామస్తులు చెబుతున్నారు. పిల్లలు పాఠశాలకు వెళ్లేందుకు కొత్తగా స్కూటీ కొన్నాడు. వారిని పాఠశాలకు పిలుచుకెళ్లి తీసుకొచ్చేవాడు. అయితే ఆపరేషన్ జరిగిన తర్వాత అతను స్కూటీ నడప వద్దని డాక్టర్లు సూచించారు. దీంతో నెలకు రూ. 6 వేలు ఇచ్చేలా ఆటో మాట్లాడుకొని పిల్లలను అందులో స్కూలుకు పంపిస్తున్నాడు. తన భర్త మానసిక స్థితి సరిగా లేక, అనారోగ్యంతో పిల్లలపై దాడి చేసి, తనూ ఆత్మహత్య చేసుకున్నాడని భార్య తులశమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సంజీవరెడ్డి తెలిపారు.

పండుగ పూట విషాదం

పెళ్లయిన నెలకే రోడ్డుప్రమాదంలో నవ వధువు మృతి




అనూరాధ మృతదేహం, గాయపడిన చంద్రమౌళి

చింతకొమ్మదిన్నె/లక్కిరెడ్డిపల్లె : కడప–రాయచోటి ప్రధాన రహదారిలోని గువ్వల చెరువు ఘాట్ రోడ్డులో శనివారం ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీ కొనడంతో అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డి పల్లె మండలానికి చెందిన అనూరాధ (30) అనే వివాహిత మృతి చెందింది. సీకే దిన్నె ఎస్ఐ బి. అరుణ్ రెడ్డి కథనం మేరకు లక్కిరెడ్డిపల్లె మండలానికి చెందిన చంద్రమౌళికి కడప తిలక్ నగర్ చెందిన అనూరాధకు నెల కిందట వివాహమైంది. సంక్రాంతి పండుగకు నూతన వధూవరులు అత్తారింటికి ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. గువ్వల చెరువు ఘాట్ రోడ్డులోని ఆంజనేయ స్వామి ఆలయంవద్ద ఉన్న మలుపులో లారీని ఓవర్‌టేక్ చేసి ముందుకు వెళ్లారు. వెనుకనే వస్తున్న లారీ వారిపై దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో చంద్రమౌళి, అతని భార్య అనూరాధ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ అనూరాధ మృతి చెందింది. చంద్రమౌళిని అత్యవసర చికిత్స నిమిత్తం వేలూరుకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.









తిమ్మక్కగారిపల్లెకు మంత్రి రోజా



బంధువులతో మంత్రి రోజా

సంబేపల్లె : మండలంలోని శెట్టిపల్లె పంచాయతీ తిమ్మక్కగారిపల్లెలో ఉన్న మాజీ జెడ్పీటీసీ ఉపేంద్రనాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ కవితల స్వగృహానికి మంత్రి రోజా శనివారం రాత్రి చేరుకున్నారు. ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగను పురస్కరించుకొని రోజా ఇక్కడకు రావడం ఆనవాయితీ. ఈ ఏడాది మంత్రి హోదాలో రావడంతో ఆమెను చూసేందుకు ప్రజలు, అభిమానులు పెద్ద సంఖ్యలో ఇక్కడకు వచ్చారు. చేరుకున్నారు. సంక్రాంతి పండుగలో భాగంగా రెండు రోజులు ఇక్కడే ఉంటూ సంక్రాంతి పండుగను జరుపుకుంటున్నట్లు తెలిసింది.

ఆయిల్ ట్యాంకర్ ఢీకొని వ్యక్తి మృతి

రాయచోటిటౌన్ : ఆయిల్ ట్యాంకర్ ఢీనడంతో వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు శనివారం సాయంత్రం రాయచోటి పట్టణం ఇందిరమ్మ కాలనీకి చెందిన మల్లికార్జున(35)ద్విచక్రవాహనంలో రింగ్‌రోడ్డు వైపు వెళుతుండగా ఆయిల్ ట్యాంకర్ ఢీకొంది.దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అనుమతి లేకుండా చెట్ల నరికివేత

మదనపల్లె : మదనపల్లె–తిరుపతి ఎన్‌హెచ్–71కు సంబంధించి ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూమిలోని చెట్లను కొందరు ప్రైవేట్ వ్యక్తులు అక్రమంగా నరికివేస్తున్నారని శానిటోరియంకు చెందిన స్థానికులు తెలిపారు. ఈ విషయమై ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ, తహసీల్దార్ సీకే.శ్రీనివాసులుకు ఫిర్యాదుచేశామన్నారు. రెవెన్యూ అధికారుల సమాచారం మేరకు.. ఎన్‌హెచ్–71 భూసేకరణలో భాగంగా రెవెన్యూ అధికారులు భూమిని సేకరించి నేషనల్ హైవే అధికారులకు అప్పగించారు. స్థలంలో పనులు జరుగుతుండగా, శనివారం ప్రభుత్వ సెలవుదినం కావడంతో స్థానికంగా కొందరు వ్యక్తులు ఎన్‌హెచ్‌కు కేటాయించిన భూముల్లో 15 భారీ వృక్షాలను నేలకూల్చారు. చెట్లను కోయగా వచ్చిన కలపను రవాణాకు ప్రయత్నించారు. స్థానికుల ఫిర్యాదుమేరకు గ్రామరెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఏడుగురి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో వివిధ కారణాలతో ఏడుగురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. మదనపల్లె మండలం చీకలబైలుకు చెందిన నాగరాజు భార్య స్వరూపతో గొడవపడ్డాడు. స్వరూప తనను పుట్టింటికి సంక్రాంతికి పంపాలని భర్తను కోరింది. భర్తను ఇంటిలోకి రానివ్వకుండా ఘర్షణకు దిగింది. దీంతో మనస్తాపానికి గురైన నాగరాజు శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగాడు. అలాగే మండలంలోని వలసపల్లెకు చెందిన మజీద్‌సాబ్ కుమారుడు ఎస్.మహబూబ్‌బాషా(40) భవన నిర్మాణ కూలీగా పనిచేస్తున్నారు. భార్యతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. శనివారం మద్యం తాగి ఇంటికి వచ్చి భార్యతో గొడవపడ్డాడు. కోపంతో మనస్తాపానికి గురై ఎలుకలమందు తిని ఆత్మహత్యకు యత్నించాడు. అపస్మారకస్థితిలో ఉన్న బాధితుడిని జిల్లా ఆస్పత్రికి తరలించారు. పట్టణంలోని డ్రైవర్స్‌కాలనీకి చెందిన సలీం భార్య ఫరీదా(36) కుటుంబసమస్యలతో భర్తతో గొడవపడింది. మనస్తాపం చెంది ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంది. ప్రమాదంలో ఫరీదా తీవ్రంగా గాయపడింది. కుటుంబసభ్యులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పట్టణంలోని నీరుగట్టువారిపల్లెలో నివసిస్తున్న కుమార్(38) చేనేత కార్మికుడిగా పనిచేస్తున్నాడు. కుటుంబకలహాలతో ఇటీవల భార్యతో విడిపోయి ఒంటరిగా జీవిస్తున్నాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది శనివారం ఉదయం నివాసం వద్ద ఉన్న ఇంటిలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబసభ్యులు అతడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తంబళ్లపల్లె మండలం మూలపల్లెకు చెందిన వెంకటరమణ భార్య వాణీశ్వరి(31) కుటుంబసమస్యలతో శనివారం భర్తతో గొడవపడింది. మనస్తాపంతో సూపర్‌వాస్మోల్ తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. నిమ్మనపల్లె మండలం దిగువబురుజు గ్రామానికి చెందిన గంగులప్ప(57) కుటుంబకలహాలతో శనివారం ఉదయం మద్యం మత్తులో ఇంట్లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నం చేశాడు. కుటుంబసభ్యులు బాధితుడిని జిల్లా ఆస్పత్రికి తరలించారు. చౌడేపల్లె మండలం గాండ్లపల్లెకు చెందిన వెంకటరమణ భార్య నవనీత(35) కుటుంబసమస్యలతో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబసభ్యులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీస్‌స్టేషన్‌లకు ఆస్పత్రిలోని అవుట్‌పోస్ట్ సిబ్బంది సమాచారం అందించారు. ఆయా మండల పోలీస్ అధికారులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.